క్లుప్తంగా

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు


మురళీమోహన్

తిరుపతి మంగళం : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీ వసూలు చేసినా, ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా సీజ్ చేస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా తిరుపతి జిల్లాలోని ఐదు కార్యాలయ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలతో ప్రైవేటు బస్సుల తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలు 10 రోజులపాటు కొనసాగుతాయని, వాణిజ్య పరమైన వస్తువులను బస్సుల్లో తరలించకూడదని, ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత బస్సుల యాజమాన్యం, డ్రైవర్లపై ఉందన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల డ్రైవర్లు మద్యం తాగి వాహనాల్ని నడపరాదని, తనిఖీల్లో పట్టుబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలబాలికల హాకీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం ఉదయం 7.30గంటలకు హాకీ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ 01-01-2007 తరువాత, జూనియర్స్‌కు 01-01-2009 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, 1పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లెలో, బాలికల జట్టు ఈ నెల 27నుంచి 29వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించే 14వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జూనియర్ హాకీ పోటీల తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 70131 77413ను సంప్రదించాలని ఆయన కోరారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం

సత్యవేడు : సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామమైన సత్యవేడుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి తూట చంద్ర ధనశేఖర్‌ను శుక్రవారం స్థానికులు సన్మానించారు. తూట చంద్ర ధనశేఖర్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత మొదటి సారి శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన అభినందలు, ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జే.పాండురంగయ్య, ఎం.శివయ్య, ఏరాసి మురళి, కళ్లూరు ప్రసాద్, పృధ్వీ విక్రం, పోజల రవిబాబు, మన్ని భాస్కర్, చెంచుబాబు, హరి, గణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు



ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్తున్న మోహిత్‌రెడ్డి



అదిగో భూలోక వైకుంఠం!

- తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో కనుల పండువగా ఉత్తర ద్వార దర్శనం
- ప్రత్యేక పూజలతో తెరుచుకున్న సప్త ద్వారాలు
- ఆకట్టుకున్న ఆనందనిలయం, గరుడ ద్వారం
- 70 వేల మందికి పైగా భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏర్పాట్లపై చెవిరెడ్డి సమీక్ష


ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

తిరుపతి రూరల్: అదిగదిగో.. భూలోక వైకుంఠం ..ఆ వైకుంఠంలో కొలువు దీరిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని వేలాది మంది భక్తులు దర్శించారు. దేవదేవుడు కొలువు దీరిన తిరుమల కొండలకు ఆనుకుని భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తుమ్మలగుంట క్షేత్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంబరాన్ని తాకాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీహరిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. తిరుమల వెళ్లి స్వామిని దర్శించలేని భక్తులు తుమ్మలగుంట చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయం వద్ద భక్తుల హృదయాలను హత్తుకునేలా భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సుంగదభరిత పుష్పాలు, పరిమళ భరిత పత్రాలతో అలంకరించారు. ముందుగా బ్రహ్మోత్సవాల్లో స్వామి వారు అధిరోహించే వాహనాలను దర్శించుకునే భక్తులు ఆపై సప్తద్వారాల గుండా ఆనంద నిలయం నీడలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆపై స్వామిని దర్శించుకుని వైకుంఠ ద్వార ప్రవేశం చేసి తమ కోరికలను స్వామికి నివేదించుకున్నారు. ప్రముఖులతో పాటుగా సాధారణ భక్తులు సైతం వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

తెరుచుకున్న సప్త ద్వారాలు

కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం భక్తులు రాగానే ఆలయానికి అతి సమీపంలో ఏర్పాటు చేసిన సప్త ద్వారాలు తెరుచుకున్నాయి. అంతకుముందు అర్చక స్వాములు సప్త ద్వారాలు, ఆనంద నిలయం, గరుడ ద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులు అక్కడ ఏర్పాటు చేసిన సప్త ద్వారాలు, ఆనంద నిలయం, గరుడ ద్వారాలను చూసి పరవశించిపోయారు.

అంగరంగ వైభవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం వైకుంఠ ద్వారానికి పూజలు చేసి ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన వంటి దైనందిన పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులను వైకుంఠ ద్వార ప్రవేశానికి అనుమతించారు. తెల్లవారు జామున 2 గంటల నుంచే తుమ్మలగుంట ఆలయం వద్దకు భక్తులు చేరుకోవడం, గంట గంటకూ భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులుతో పాటు ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దగ్గరుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. సామాన్య భక్తులకు సులభంగా దర్శనం కలిగించేలా చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ

వైకుంఠ ఏకాదశి పర్వదినాన నిజమైన వైకుంఠాన్ని తలపించేలా తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రత్యేకంగా దేశ, విదేశాల నుంచి తీసుకొచ్చిన పది టన్నుల పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. దీనికి విద్యుత్ కాంతులు తోడవడంతో ఆలయ పరిసరాలు వెలిగి పోతున్నాయి.

70 వేల మందికిపైగా దర్శనం

వైకుంఠ ఏకాదశి పర్వదినాన సుమారు 70 వేల మందికిపైగా భక్తులు శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించి వైకుంఠ ద్వారంలో ప్రవేశించారు. సాదారణ భక్తులతో పాటు తిరుపతి, చుట్టు పక్కల నియోజకవర్గాల నుంచి పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా తరలి వచ్చారు. వీఐపీల దర్శన సమయంలో కూడా సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వివిధ రకాల ఆకారాలలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. వైకుంఠ ద్వారంతో పాటు ప్రధాన ఆలయం లోపల, బయట, ధ్వజస్తంభం పరిసర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన పుష్పాలతో రకరకాల ఆకృతులతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అలరించిన నృత్యాలు

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన కళా వేదికపై విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు భక్తులకు కను విందు చేశాయి. చిన్నారుల దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



ఉపాధి ఏపీఓ సస్పెన్షన్

సత్యవేడు: మండల పరిధిలో ఉపాధి ఏపీఓ కృష్ణయ్యను, ఎంటీఏ సుమలతను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మండలానికి 60 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో 50 పూర్తిచేయాల్సి ఉండగా.. అందుకు తగ్గ విధంగా నిర్మించకపోవడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

‘కొండ’ంత వెలితి!


వైకుంఠ క్యూ కాంప్లెక్స్-2 లో ఖాళీగా స్కానింగ్ కౌంటర్

- వైకుంఠ ఏకాదశి నాడు బోసిపోయిన తిరుమల
- టోకెన్లు పొందినా దర్శనానికి రాని భక్తులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుమల : వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీలో టీటీడీ వైఫల్యం చెందింది. భక్తులకు పకడ్బందీ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ క్రమంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు లేక తిరుమల బోసిపోయింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట కారణంగా టోకెన్లు పొందిన భక్తులు సైతం ఉత్తర ద్వార దర్శనానికి రాలేదు. తిరుమల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. ఈ ఏడాది భక్తుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఇందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వం, టీటీడీ బోర్డు, అధికారులదే అని భక్తులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే తిరుమలలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు చోటు చేసుకోవడంతో టీటీడీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బేడీ ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్ల స్టాండ్ ఒక్కసారిగా కూలింది. వైభవోత్సవ మండపం వద్ద గేట్లను పూర్తిగా మూసివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సహనం కోల్పోయి గేట్లు ఎక్కి దూసుకెళ్లారు. మరి కొందరు గేట్లు కింద దూరి వెళ్లడం కనిపించింది. స్వర్ణ రథోత్సవ సమయంలో సైతం హయగ్రీవ ఆలయ సమీపంలో తోపులాట జరిగింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భక్తుల విజ్ఞప్తి మేరకు ఆగమసలహా దారులతో సంప్రదించి పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేవారు. భక్తులకు ఏ రోజు దర్శనం కావాలో ఆ రోజుకు టోకెన్లు ఇచ్చేవారు. ఈ మేరకు వివరాలను టోకెన్ కేంద్రాల వద్ద ప్రదర్శించేవారు. దీంతో భక్తులు టోకెన్లు తీసుకుని సాఫీగా శ్రీవారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునే వారు.

ప్రస్తుతం ఇలా..

టీటీడీ బోర్డులో కూటమి ప్రభుత్వం నియమించిన వారు దర్శనాల కోటా కోసమే పాకులాడుతుంటారని టీటీడీ అధికారులే చెబుతున్నారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా.. ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోవింద మాల ధరించిన భక్తులకు సైతం ప్రాధాన్యత ఇవ్వలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ప్రకటనే కొంప ముంచింది

వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులు టోకెన్లు ఉంటేనే తిరుమలకు రావాలని టీటీడీ భారీగా ప్రచారం చేసింది. అందులో భాగంగా మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లు ఇస్తామని ప్రకటించింది. మిగిలిన ఏడు రోజులకు 12వ తేదీ నుంచి టోకెన్లు ఇస్తామని తెలిపింది. ప్రతి భక్తుడు నేరుగా ముఖ హాజరుతో టోకెన్ పొందాలని నిబంధన పెట్టింది. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులంతా ఒకేసారి తిరుపతికి చేరుకున్నారు. వచ్చిన భక్తులను వచ్చినట్లు క్యూలోకి పంపకుండా పోలీసులు ఆపేశారు. భక్తుల తాకిడి అధికం కావటంతో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఒక్కసారిగా అందరినీ క్యూలోకి వదిలేశారు. ఈ క్రమంలోనే తీవ్రమైన తొక్కిసలాట జరిగింది. ఫలితంగా ఆరుగురు మృతి చెందారు. సుమారు 60 మంది గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

భయభ్రాంతులకు గురైన భక్తులు

తిరుపతి చరిత్రలో ఎన్నడూ జరగని ఘటనను ప్రత్యక్షంగా చూసిన భక్తులు టోకెన్లు తీసుకున్నా.. వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్లకుండా వెనుదిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. అందుకే వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలోని 32 కంపార్ట్ మెంట్లు ఖాళీగా కనిపించాయి.



తిరుమలలో నిర్మానుష్యంగా క్యూ కాంప్లెక్స్


ఖాళీగా సీఆర్‌ఓ కార్యాలయం వద్ద రూముల క్యూ

ఎంబీయూలో ఘనంగా స్పోర్ట్స్ డే


సన్మాన కార్యక్రమంలో ఎంబీయూ చాన్సలర్ మంచు మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ విష్ణు

చంద్రగిరి: మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లో వెలసిన ఎంబీ యూనివర్సిటీ, శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు, ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్పోర్ట్స్ డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు పలు నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. ఇక్కడ 25శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం ఆదర్శనీయమన్నారు. విజేతలకు మోహన్‌బాబు, కొండా సురేఖ, మంచు విష్ణు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు కొండా సురేఖను ఘనంగా సత్కరించారు. ఎంబీయూ ప్రోవోస్ట్ నాగరాజ రామారావు, వీసీ కరుణాకిరణ్, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్‌ఏ రవిశేఖర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్‌డే వేడుకలు

ఎంబీయూలో నూతనంగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు హాజరయ్యారు. లైబ్రరీ, సెంట్రల్ కిచెన్, ఇండోర్ స్టేడియం ప్రపంచ స్థాయిలో ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం

చిత్తూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లా కమిటీలో పలువురికి పలు హోదాల్లో నియామకం కల్పిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్(చిత్తూరు), కె కోదండరెడ్డి (కుప్పం), శాంతిసాగర్‌రెడ్డి (పూతలపట్టు), గురవరెడ్డి (గంగాధరనెల్లూరు), బీడీ భాస్కర్ (నగరి), సాయిక్ ముజమ్మిల్ (పలమనేరు), దామోదరరాజు (పుంగనూరు), ముస్తూరు రవి (తిరుపతి), ధనుంజయ్యరెడ్డి (సత్యవేడు) నియమితులయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వేలకచర్ల గోపాల్‌రెడ్డి(తిరుపతి), టీజీ మహేశ్వర్ నాయుడు (చిత్తూరు), ఎస్కే మురవత్ భాషా(పుంగనూరు), దయాసాగర్‌రెడ్డి (గంగాధరనెల్లూరు), టి. అనిల్‌కుమార్ (నగరి) నియమితులయ్యారు. అలాగే పార్టీ జిల్లా కోశాధికారిగా తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు(తిరుపతి), కార్యనిర్వాహక కార్యదర్శిగా కరేటి శ్రీను (తిరుపతి), బత్తిన బాబు (తిరుపతి), ఎస్ఎస్ రజనీకాంత్ (చిత్తూరు), జె దిలీప్‌కుమార్ (చిత్తూరు), సుబ్బన్న యాదవ్ (పుంగనూరు), ఉదయ్‌కుమార్‌రెడ్డి (పుంగనూరు), లక్ష్మణ్‌రెడ్డి (పలమనేరు), రాధాకృష్ణ(పలమనేరు), ఎం వెంకటేష్ (కుప్పం), సౌకత్ అల్లీ(కుప్పం), గోవిందస్వామి(పూతలపట్టు), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), ఆర్ బాలాజీ(గంగాధర నెల్లూరు), రామయ్య(గంగాధరనెల్లూరు), లీలారామన్(నగరి), చిరంజీవి(నగరి) నియమితులయ్యారు. క్రియాశీలక కార్యదర్శులుగా రామక్రిష్ణారెడ్డి (పుంగనూరు), వెంకటరమణ(పుంగనూరు), శంకరప్ప(పలమనేరు), బాబు(పలమనేరు), టి కుమార్ (చిత్తూరు), టి కృష్ణమూర్తి రెడ్డి(చిత్తూరు), ఆర్ చలపతి (కుప్పం), మురుగేష్(కుప్పం), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), కిషోర్‌రెడ్డి (పూతలపట్టు), కుప్పయ్య (గంగాధర నెల్లూరు), విజయ్‌కుమార్ (గంగాధర నెల్లూరు), టీసీ మురగయ్య(నగరి), మాధవ వర్మ(నగరి), సి.జగదీష్ రెడ్డి(సత్యవేడు), లాల్‌బాబ్ యాదవ్ (సత్యవేడు), జె.గోపాల్‌రెడ్డి(సత్యవేడు), రాకేష్ కిరణ్(సత్యవేడు), దశనం ప్రసాద్‌రాజు(తిరుపతి), ఎ కోటి (తిరుపతి) నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా రాజశేఖర్‌రెడ్డి (పుంగనూరు), రంగనాథం(పలమనేరు), గాయత్రీదేవి(చిత్తూరు), భాస్కర్ నాయక్ (కుప్పం), కోదండన్(గంగాధరనెల్లూరు), నల్లప్ప రెడ్డి సుధాకర్ రెడ్డి(పూతలపట్టు), చెంచు రమణరాజు(నగరి), వెంకటయ్య అలియాస్ చిన్న(సత్యవేడు),పసుపులేటి సురేష్ రాయల్(తిరుపతి), యాచం వాసుదేవ యాదవ్(తిరుపతి)లను నియమించినట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది.

నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో కోట మండలం, రామాపురానికి చెందిన వై. వెంకటేశ్వర్లుకు ఏడాది జైలు శిక్ష, 24 వేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. 2011లో నిందితుడు వెంకటేశ్వర్లు మరొకరితో కలిసి కృష్ణాపురం, కరకంబాడి బీట్, అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి దుంగలను తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో వెంకటేశ్వర్లతో పాటు అరెస్టయిన నిందితుడు కోర్టుకు హాజరు కాలేదు. దీంతో న్యాయమూర్తి అతన్ని నాన్ బెయిలబుల్ వారెంట్ పై అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాలని ఆదేశాలు జారీచేశారు. వెంకటేశ్వర్లు పై మాత్రం కేసు విచారణ జరిగింది. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో రెండో నిందితుడుగా ఉన్న వ్యక్తిని 2013 నుంచి ఇప్పటివరకు అరెస్టు చేయలేకపోవడంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ పెండింగ్లో ఉండడం విశేషం.

క్లుప్తంగా

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం బంగారు తిరుచ్చిపై విహరించారు. వైకుంఠ ఏకాదశితో పాటు వారపు ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖమండపం వద్ద స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం అలంకార మండపంలో వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార భూషితులైన శ్రీవారి దేవేరి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న అనిల్‌కుమార్

పాకాల : మహాప్రస్థాన్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మట్టా అనిల్‌కుమార్‌కి అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూ మన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదా నం చేసింది. శుక్రవారం చెన్నైలోని రాజా అ న్నామలై మంద్రంలో నిర్వహించిన కార్యక్ర మంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.వెంకటేశన్ చేతుల మీదుగా పురస్కారం అందించింది.

యూజీసీ నిర్ణయంపై హర్షం



లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న ఏబీఆర్ఎస్ఎం సభ్యులు

తిరుపతి సిటీ : యూనివర్సిటీల్లో అధ్యాపక నియామకాలు, ఉద్యోగోన్నతుల నిబంధనలను సడలిస్తూ యూజీసీ తీసుకున్న నిర్ణయంపై ఏబీఆర్ఎస్ఎమ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీలో ఆ సంఘం జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటా లక్ష్మణ్‌ను కలసి యూజీసీ మార్గదర్శకాలపై చర్చించారు. అనంతరం ఆయనకు పుస్తకం అందించి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ సెక్రటరీ డాక్టర్ ఎన్.బాలసుబ్రమణ్యం, పాండిచ్చేరి వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ శ్రీచరణ్, సంస్కృత వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ బుల్లిదాస్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చందూలాల్, జేబీ చక్రవర్తి పాల్గొన్నారు.

సగం ధరకే పుస్తకాలు

తిరుపతి కల్చరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా శని, ఆదివారం రెండు రోజుల పాటు నగరంలో నిర్వహించే ప్రదర్శనలో సగం ధరకే పుస్తకాల విక్రయించనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగానున్న ప్లాట్‌ఫామ్ మీద పుస్తక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. తెలుగు, ఆంగ్లం, కవిత్వ, కథ సంపుటాలు, నవలలు, జీవిత చరిత్రలు, జీకే, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, ఆధ్యాత్మిక పుస్తకాలు లభిస్తాయని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంటీన్ వేలానికి టెండర్లు

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలోని క్యాంటీన్ నిర్వహణ వేలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ వరకు క్యాంటీన్ నిర్వహణ కాలం ఉంటుందన్నారు. ఈనెల 17వ తేదీ లోపు టెండర్ కాపీలను తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

'నరేంద్ర ఆరోహణం' పై ప్రశంసలు



సోమనాథ్‌ను సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీవిత చరిత్రను నరేంద్ర ఆరోహణం పేరుతో జాతీయ సంస్కృత వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమనాథ్ దాస్ రచించారు. శుక్రవారం ఈ పుస్తకాన్ని గుజరాత్‌లోని శ్రీసోమనాథ్ సంస్కృత విశ్వవిద్యాలయం అంబాజీలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విడుదల చేశారు. వర్సిటీ అధికారులు మాట్లాడుతూ ప్రధాని జీవత చరిత్రను భావితరాలకు మార్గదర్శకంగా సోమనాథ్ రచించడంపై ప్రశంసలు కురిపించారు. అనంతరం ఆయనను జ్ఞాపికతో సత్కరించారు. ఈ క్రమంలో సోమనాథ్‌కు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

ఇల 'వైకుంఠం'



తిరుమల : శ్రీవారి ఆలయం ఎదుట ఫల, పుష్పాలతో విశేషాలంకరణ







తుమ్మలగుంట ఆలయంలో ఉత్తర ద్వారం

వైకుంఠ ఏకాదశి పండుగను శుక్రవారం అత్యంత పవిత్రంగా భక్తులు జరుపుకున్నారు. విశేషాలంకరణలో శోభాయమానంగా సిద్ధమైన ఆలయాలకు పోటెత్తారు. వేకువజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరారు. తిరుమల శ్రీవారి సేవించుకునేందుకు కొండకు తరలివెళ్లారు. మహిమాన్విత వాహనాలపై విహరించిన వేంకటనాథుని స్మరించుకుంటూ తరించారు. తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద ఏర్పాటు చేసిన విశిష్ట మార్గంలో శ్రీహరి దివ్య చరణాలను దర్శించుకున్నారు. తిరుప్పావై సేవలో సేదతీరిన భోగశ్రీనివాసమూర్తిని వీక్షించి తన్మయత్వం చెందారు. ఈ క్రమంలోనే ఆనవాయితీ ప్రకారం కాసరం హరీష్ దంపతులు.. శిల్పం విద్యాసాగర్ పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే గోవిందరాజస్వామి ఆలయంలో విశేష పూజలు జరిపించారు. పెద్దసంఖ్యలో నగరవాసులు తరలివచ్చి దేవదేవేరులను సేవించుకున్నారు. కోదండరామస్వామి గుడిలో సీతా రామలక్ష్మణులకు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. వైకుంఠ ద్వారం నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గం శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారిని వైకుంఠ ద్వారం నుంచి వేలాది మంది దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేడుకగా ఆస్థానం నిర్వహించారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. పాకాల మండలం నేంద్రగుంటలోని వెంకన్న ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారం అందుబాటులోకి తీసుకువచ్చారు.

– తిరుమల / తిరుపతి కల్చరల్ /చంద్రగిరి/ పాకాల

పడిగాపుల పయనం

సంకాంత్రి పండుగ నేపథ్యంలో ప్రజలు సొంత ఊళ్లకు పయనమయ్యారు. ఈ మేరకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు పెద్దసంఖ్యలో ప్రయాణికులు తరలివచ్చారు. అవసరాలకు తగ్గట్లు అదనపు సర్వీసులను నడపడంలో అధికారులు వైఫల్యం చెందారు. సీట్ల కోసం జనం కుస్తీలు పట్టాల్సి దుస్థితి కల్పించారు. అయినప్పటికీ అందుబాటులోని బస్సుల్లోనే ప్రయాణికులు తమ గమ్యస్థానానాలకు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలోనే వరుస సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు సైతం బస్టాండ్‌కు పోటెత్తారు. ఆర్టీసీ సేవలు అరకొరగా ఉండడంతో ఎక్కువ మంది ఇతర వాహనాల వైపు కూడా మొగ్గుచూపారు. ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ వారు రేట్లు పెంచి యథేచ్ఛగా దోపిడీకి తెరతీశారు.



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- కిక్కిరిసిన సెంట్రల్ బస్టాండ్
- సీట్ల కోసం ప్రయాణికుల కుస్తీలు
- అవసరాల మేరకు నడవని బస్సులు
- గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి
- ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ



సీట్ల కోసం ప్రయాణికుల పాట్లు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రయాణికులతో కిటకిటలాడింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పలు ఆలయాలకు వెళ్లేందుకు భక్తులు విచ్చేశారు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా వరుస సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పలువురు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. జిల్లావ్యాప్తంగా పండుగకు 200 సర్వీసులను అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు నాలుగు రోజుల క్రితం ప్రకటించారు. అయితే ఇందులో 20శాతానికి మించి బస్సులు ఏర్పాటు చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి నామమాత్రంగానే సర్వీసులు నడుస్తున్నాయి. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

అందుబాటులో లేని విద్యుత్ బస్సులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంద విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చారు. అలిపిరి డిపో కేంద్రంగా ఈ సర్వీసులు నడుస్తున్నాయి. 50 సర్వీసులు తిరుమలకు. 14 సర్వీసులు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు. 12 సర్వీసులు మదనపల్లెకు, 12 సర్వీసులు కడపకు, 12 సర్వీసులు నెల్లూరుకు ఏర్పాటు చేశారు. అయితే కూటమి సర్కార్ వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే పలు సర్వీసులు పండుగకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు వివిపిస్తున్నాయి.

సీటు దొరికితే లక్కే..!

తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, సత్యవేడుకే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. గంటల కొద్దీ బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇక సీటు దొరికితే అది లక్కేనని పలువురు ప్రయాణికులు తెలియజేశారు.

ట్రావెల్స్ భారీ రేట్లు

పలు ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు టికెట్ రేట్లను భారీగా పెంచేశారు. అలాగే ఒకే నంబర్‌తో రెండు సర్వీసులను నడిపేస్తున్నారు. తిరుపతి నుంచి విజయవాడకు రూ.450 నుంచి 500 ఉండేది. అయితే కొన్ని ట్రావెన్స్ రూ.1000 నుంచి 1,200 గుంజేస్తున్నారు. కేవలం ఆర్టీసీ సర్వీసులు ఆశించిన మేరకు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు వచ్చాయని పలువురు మండిపడుతున్నారు. దూర ప్రాంతాల ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌లో పడిగాపులు కాయలేక...నగదు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు.

ఆప్కోలో డిస్కౌంట్ సేల్స్

తిరుపతి కల్చరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి గాంధీరోడ్డు, శ్రీనివాసం టీటీడీ కాంప్లెక్స్, తిరుమల, చిత్తూరు, నెల్లూరులోని ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలను 30 శాతం డిస్కౌంట్ ధరలతో విక్రయాలు చేపడుతున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి ఎస్. కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాదవరం, చీరాల కాటన్ , పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ షర్టులు, దుప్పట్లు, దోవతులు, లుంగీలు, టవల్స్ వంటి చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన వారు ఆప్కో అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని డోర్ డెలివరీ పొందవచ్చని సూచించారు.

పైపుల తొలగింపు



పైపులను తొలగిస్తున్న జేసీబీ

తిరుపతి మంగళం : మంగళం సమీపంలోని మిట్టగాంధీపురం వద్ద కొందరు ప్రైవేట్ వెంచర్ యజమానులు పంట కాలువను పూడ్చి వేయడంపై శుక్రవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ ఫిర్యాదు చేశామని, అధికారులు ఆదేశించినప్పటికీ వెంచర్ యజమానులు స్పందించలేదని మండిపడ్డారు. దీంతో జేసీబీ సాయంతో తామే పైపులను తొలగించినట్లు వెల్లడించారు.

బీసీ బిల్లు కోసం ఒత్తిడి పెంచాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

తిరుపతి కల్చరల్ : పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లుకోసం ముఖ్యమంత్రి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు. అలాగే కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించి బీసీల అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. శ్రీనివాసులు, నాగేశ్వరరావు, జల్లి మధుసూదన్, నూకాలమ్మ, జగన్నాథం, అమరనాథ్, మల్లేష్, ఆదిశేషు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు, క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా క్రీడా భారతి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఆఫీసర్ క్లబ్, టౌన్ క్లబ్‌లో లేట్ సానాల నాగముని మెమోరియల్ నిర్వాహకులు లాన్‌టెన్నిస్ టోర్నమెంట్ ఏర్పాటుచేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీలను శుక్రవారం ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్ఆర్ గుప్తా హాజరయ్యారు. క్రీడా భారతి జిల్లా కార్యదర్శి దండు రవి మాట్లాడుతూ 40, 50, 60, 70 వయసుల కింద నాలుగు విభాగాలు పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ మోహన్ మునిసిద్ధారెడ్డి, ప్రొఫెసర్లు సి.రఘునాథరెడ్డి, హనుమంతురావు, డాక్టర్ నజరుద్దీన్, జి.అరవింద్, బీఎస్ నందకుమార్, క్రీడా భారతి జిల్లా చీఫ్ ప్యాట్రన్ పి.విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా సుగుణవతి



సుగుణవతి యాదవ్‌కు కండువా వేస్తున్న ఆర్.కృష్ణయ్య

తిరుపతి కల్చరల్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన చెరుకుల సుగుణవతి యాదవ్ నియమితులయ్యారు. శుక్రవారం ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందించారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నుంచి వేడుకగా సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు ఏఓ ఖాదర్‌వలీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 12న ఉదయం 11 గంటలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13న భరతనాట్య ప్రదర్శన, 14న సినీ, జానపద, శాస్త్రీయ ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 15న కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనదలచిన వారు 88866 52044 నంబరును సంప్రదించాలని సూచించారు.

'శ్రీరామ'లో..



పండుగలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడమే సంబరాల ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

అధికారుల తప్పిదంతోనే భక్తుల మృతి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న హిందూ జన శక్తి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : టీటీడీ అధికారుల తప్పిదంతోనే వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల జారీలో ఆరుగురు భక్తులు మృతి చెందారని హిందూ జనశక్తి అధ్యక్షుడు లలిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ అధికారులకు ప్రచార ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టడంపై లేదని ఆరోపించారు. సామాన్య భక్తులను చులకనగా చూడడమే ఇంతటి దుర్ఘటనకు దారి తీసిందని విమర్శించారు. ఈ కేసులో టీటీడీ ఈఓ, అదనపు ఈఓ, జేఈఓ, ఎస్పీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీవారి భక్తులను దారుణంగా కొట్టిన పోలీసులను గుర్తించి వారిని డిస్మిస్ చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు. ఓంకార్, దిలీప్, కేశవులు, వేణుగోపాల్, నిర్మలమ్మ, మధు, శివభక్తి అధ్యక్షుడు కరుణాకర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణే ఉన్నతికి సోపానం



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి కల్చరల్ : క్రమశిక్షణే విద్యార్థుల ఉన్నతి సోపానమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వెరిటాస్ సైనిక్ స్కూల్ వెరిటాస్ ఉత్సవం పేరిట తలపెట్టిన ఐదవ వార్షికోత్సవం వేడుకలు మహతి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విలువలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వెరిటాస్ స్కూల్ యాజమాన్యం అభినందనీయమన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. డైరెక్టర్ శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం 17 మందితో ఆరంభమైన పాఠశాల నేడు 1,600 మంది విద్యార్థులతో విజయపథంలో నడుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీఆర్ఎస్ చక్రవర్తి, అదనపు డైరెక్టర్ సందీప్ రెడ్డి, సీజీఎం ఖాన్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.నాగార్జున పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

తిరుపతి తుడా : వైకుంఠ ఏకాదశి టోకెన్ కేంద్రాల వద్ద క్యూలో తొక్కిసలాట కారణంగా గాయపడి స్విమ్స్ పద్మావతి వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జై భారత్ నేషనల్ పార్టీ ప్రెసిడెంట్ జేడీ లక్ష్మీనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్వీ భార్గవ్ సాయి పాల్గొన్నారు.

ఆరునెలల్లోనే అన్నీ చేయలేం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి : ఆరునెలల్లోనే అన్ని పనులూ చేయలేమని, సమస్యల పరిష్కారానికి కాస్త సమయం ఇవ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళితే స్పందించడం లేదని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రమౌళిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద సుమారు రూ.1.5కోట్ల వ్యయంతో వికలాంగుల కాలనీ, జోగుల కాలనీ, అక్కగార్లకాలనీ, బీడీ కాలనీ ప్రజల దాహార్తి తీర్చడం కోసం వాటర్ ట్యాంకు, సంపు ట్యాంకు నిర్మించినట్లు తెలిపారు. అయితే మొండి కాలువ నుంచి చంద్రగిరికి వస్తున్న తాగునీటి పైప్‌లైన్‌ను వాటర్ ట్యాంకు అనుసంధానం చేయాల్సిన అవసరముందని వెల్లడించారు. ఐతేపల్లె సర్పంచ్ ఫాజిలా మాట్లాడుతూ వైఎస్సార్ ఇందిరమ్మ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. మామండూరులో వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. అగరాలలో వాటర్ ట్యాంకు అవసరమని సర్పంచ్ భాస్కర్ రెడ్డి కోరారు. ఆరిమేణి గంగమ్మ ఆలయం వద్ద సుమారు రూ.16లక్షలతో సీసీ రోడ్డు పూర్తి చేశామని, బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. కూచువారిపల్లి, మూలపల్లి ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ రాగిణి చెప్పారు. చంద్రగిరి, అగరాలల నుంచి వచ్చే మురుగునీటి కారణంగా స్థానికులు రోగాల బారిన పడుతున్నట్లు సర్పంచ్ వెంకటయ్య తెలిపారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో సుమారు రూ.40లక్షలు వెచ్చించి కాలువ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. ఎంపీటీసీ సభ్యులు సుజాత మాట్లాడుతూ మురుగు నీటి కారణంగా సుమారు 200 ఎకరాలు ముంపునకు గురవుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సమయం పడుతుందన్నారు.

టీడీపీ నేతల హల్‌చల్

మండల మీట్‌లో టీడీపీ నేతలు హల్‌చల్ చేశారు. అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్న సమయంలో తమ్ముళ్లు అన్ని కుర్చీలను ఆక్రమించేశారు. గతంలో ఎన్నడూ అధికారిక సమావేశంలో పార్టీల నేతలను అనుమతించేవారు కాదు. చివరకు స్వయంగా ఎమ్మెల్యే నాని కల్పించుకుని టీడీపీ నాయకులు బయటకు వెళ్లాలని సూచించాల్సి వచ్చింది. అయినప్పటికీ పలువురు నేతలు సభలోనే కూర్చోవడం గమనార్హం.